నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
5 | నిజామాబాద్, మంగళవారం 7 మే 2024 | KAMAREDDY

## అడుగడుగునా నీరాజనం

**లోక్‌సభ ఎన్నికల** ప్రచారంలో భాగంగా నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు ఘన స్వాగతం పలికారు. కేసీఆర్ బస్సు యాత్ర కంఠేశ్వర్ బైపాస్‌కు చేరుకోగానే బాణా సంచాలు కాలుస్తూ ..కేసీఆర్‌పై పూల వర్షం కురిపించారు. బస్సుయాత్ర వెంట బీఆర్ఎస్ శ్రేణులు వాహనాలపై తరలివచ్చారు. గులాబీ జెండాలు, ప్లకార్డులు పట్టుకొని బీఆర్ఎస్ జిందాబాద్..కేసీఆర్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. కేసీఆర్ వాహనం ధర్నాచౌక్ నుంచి జిల్లా కోర్టు చౌరస్తా వద్దకు చేరుకోగా..అప్పటికే అక్కడ వేచి ఉన్న ప్రజలు, అభిమానులు బాణాసంచాలు కాల్చి ఘన స్వాగతం పలికారు. వారికి కేసీఆర్ బస్సులో నుంచి అభివాదం చేశారు.





రోడ్‌షోకు హాజరైన అశేష జనవాహిని

# యుద్ధం చేయాల్సిందే



రోడ్‌షోలో మాట్లాడుతున్న కేసీఆర్, పక్కన వేముల ప్రశాంత్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, సురేశ్‌రెడ్డి, బిగాల గణేశ్‌గుప్తా, ఆశన్నగారి జీవన్‌రెడ్డి, ఆయేషా ఫాతిమా

- ఇందూరు గడ్డపై కేసీఆర్ గర్జన
- గులాబీ బాస్‌కు ప్రజల బ్రహ్మరథం
- అడుగడుగునా అపూర్వ స్వాగతం
- తన వాగ్ధాటితో ఆకట్టుకున్న మాజీ ముఖ్యమంత్రి
- మోదీని వ్యతిరేకించినందుకు కవితను జైల్లో వేసింద్రు
- అయినా కేసీఆర్ లొంగిపోలె.. భయపడలె..
- కాంగ్రెస్‌కు మైనార్టీలు ఓటేస్తే బీజేపీదే విజయం
- రోడ్‌షోలో గులాబీ దళపతి కేసీఆర్
- నిజామాబాద్ పులిబిడ్డ బాజిరెడ్డిని గెలిపించాలని పిలుపు

## బీజేపీ, కాంగ్రెస్‌లను తరిమి కొట్టాలె..

**ఉద్యమ సారథికి** ఇందూరు బ్రహ్మరథం పట్టింది. గులాబీ జెండా ఎత్తిన నాడు అండగా నిలబడిన నిజామాబాద్ గడ్డ.. మరోసారి గులాబీ దళపతికి 'జన' స్వాగతం పలికింది. అదే ఆదరణ.. అదే అభిమానం.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అడుగడుగునా పూల వర్షం కురిసింది. గులాబీ వనంగా మారిన జిల్లా కేంద్రంలో నిర్వహించిన రోడ్ షోకు అపూర్వ స్పందన లభించింది. దాదాపు అరగంట పాటు ప్రసంగించిన బీఆర్ఎస్ అధినేత బీజేపీ, కాంగ్రెస్ తీరును ఎండగట్టారు. మాటలతో మోసపుచ్చిన రెండు పార్టీలను ఓడించి, నిజామాబాద్ పులిబిడ్డ బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు.

–నిజామాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ ఖలీల్‌వాడి/వినాయక్‌నగర్/కంఠేశ్వర్

## బీజేపీకి లొంగలేదనే కవిత అరెస్టు..

కవిత అరెస్టు వ్యవహారంపై కేసీఆర్ మాట్లాడారు. బీజేపీ చెప్పినట్లు వినలేదనే కారణంతో తన బిడ్డ కవితను అరెస్టు చేశారంటూ కేసీఆర్ భావోద్వేగంతో అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బీజేపీకి లొంగేది లేదని, తాను భయపడే వ్యక్తిని కాదని, పోరాటం చేస్తానంటూ చెప్పారు. తాను హిందువునని, తెలంగాణ ప్రజల ఆత్మబంధువునని వివరించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు నెలల పాలనలో ఘోరంగా విఫలమైందని కేసీఆర్ అన్నారు. బీఆర్ఎస్ చేసిన మంచి పనులన్నీ ఆగిపోవాలనే లక్ష్యంగా పెట్టుకున్నదన్నారు. ఇక్కడ మన కండ్ల ముందే కనిపిస్తోందని, వీటన్నంటి మీద నిలదీస్తుంటే ముఖ్యమంత్రి అడ్డగోలుగా మాట్లాడుతున్నారన్నారని మండిపడ్డారు. 'కేసీఆర్ నీ గుడ్లు తీసుకొని గోలీలు ఆడుతా... నీ పేగులు మెడల వేసుకుంటా... నీ లాగుల తొండలు సొర్రకొడుతా... నిన్ను జైళ్ల వేస్తా...' అని ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని... జైళ్లకు కేసీఆర్ భయపడుతడా... తాను జైళ్లకు భయపడితే తెలంగాణ రాష్ట్రం వచ్చేదా... అంటూ కేసీఆర్ ప్రశ్నించారు.

## నిజామాబాద్ పులిబిడ్డ బాజిరెడ్డిని గెలిపించాలి..



**ఒక బీఆర్ఎస్సే** తెలంగాణకు శ్రీరామ రక్ష అని కేసీఆర్ అన్నారు. భారీ మెజార్టీతో నిజామాబాద్ పులిబిడ్డ బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు.. రెప్పపాటు కూడా పోకుండా వచ్చిన కరెంట్.. ఇవాళ స్విచ్(కట్కా) ఏసినట్లు ఎందుకు పోతున్నదన్నారు. కేసీఆర్ రథం ఎక్కగానే రైతుబంధు వస్తున్నదన్నారు. దెబ్బకు దెయ్యం వదిలి రైతుబంధు పడుతున్నదని చెప్పారు. రోడ్‌షో అనంతరం గులాబీ దళపతి కేసీఆర్ నేరుగా మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా నివాసానికి వెళ్లారు. రోడ్‌షోలో రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్ రెడ్డి, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, మాజీ ఎమ్మెల్యేలు జీవన్ రెడ్డి, బిగాల గణేశ్ గుప్తా, మాజీ ఎమ్మెల్యే షకీల్ భార్య ఆయేషా ఫాతిమా, బిగాల మహేశ్ గుప్తా, వీజీ గౌడ్, ఎస్.ఏ.అలీం తదితరులు పాల్గొన్నారు.

## జనప్రవాహం.. రోడ్‌షో దిగ్విజయం

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రెండ్రోజులుగా చేపట్టిన బస్సు యాత్ర, రోడ్‌షో దిగ్విజయమైంది. సోమవారం రాత్రి నిజామాబాద్‌లో ఉవ్వెత్తున తరలి వచ్చిన జనంతో రోడ్‌షో సూపర్ సక్సెస్ అయ్యింది. జగిత్యాల నుంచి బస్సులో వచ్చిన కేసీఆర్‌కు దారి పొడవునా జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లో ఘన స్వాగతం లభించింది. నిజామాబాద్ సరిహద్దు ప్రాంతమైన కమ్మర్‌పల్లి వద్ద మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి నేతృత్వంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం మోర్తాడ్, వేల్పూర్ ఎక్స్ రోడ్డు మీదుగా వచ్చిన గులాబీ బాస్‌కు ఆర్మూర్ నేతలు, ప్రజలంతా కలిసి ఎదురేగి జయహో కేసీఆర్ అంటూ నిజామాబాద్ వైపు కదిలారు. మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి సారథ్యంలో భారీ కాన్వాయ్ పెర్కిట్ మీదుగా జిల్లా కేంద్రం వైపునకు కదలగా గూపన్‌పల్లి వద్ద బిగాల గణేశ్ గుప్తా నేతృత్వంలో మాజీ సీఎం కేసీఆర్‌కు భారీ ఎత్తున స్వాగతం లభించింది. బైపాస్ రోడ్డు నుంచి జనవాహిని మధ్య బస్సు యాత్ర కొనసాగింది.

**ప్రజలకు అభివాదం చేస్తూ..**

నిజామాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను వెంట పెట్టుకొని దారి పొడవునా ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. నెహ్రూ పార్కుకు చేరుకున్న అనంతరం అక్కడ నిర్వహించిన రోడ్‌షోలో అశేష జనవాహినిని ఉద్దేశించి కేసీఆర్ ప్రసంగించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల తీరును ఎండగట్టడంతోపాటు పార్లమెంట్ పోరులో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు ఆవశ్యకతను కేసీఆర్ నొక్కి చెప్పారు.

## ముస్లిం, మైనార్టీలంటే కాంగ్రెస్‌కు గౌరవమే లేదు..

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు గిరిజనులకు బ్రహ్మాండంగా నాలుగున్నర లక్షల ఎకరాలకు పోడు భూములు ఇచ్చామని కేసీఆర్ చెప్పారు. వాళ్లకు రైతుబంధు ఇవ్వడంతో పాటు రైతుబీమా కూడా ఇచ్చామన్నారు. ఇవాళ ఈ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా గిరిజనులకు ఇవ్వలేదన్నారు. ఇలా ఈ ఒక్కవర్గం ప్రజలనే కాదు... ఇటు దళితులను, ముస్లిం మైనార్టీ సోదరులతోపాటు అందరినీ ఇబ్బందులు పెడుతున్నదన్నారు. తాను ఉన్నప్పుడు ముస్లిం మైనార్టీ సోదరులకు ప్రతి సంవత్సరం రంజాన్ తోఫా పంపించానని, మరి ఈసారి తోఫా వచ్చిందా.. ఇఫ్తార్ విందులు జరిగినయా.. అని కేసీఆర్ అడగ్గా.. రాలేదంటూ సభకు వచ్చిన ముస్లిం ప్రజలంతా ముక్తకంఠంతో చెప్పారు. 'ఎలా వస్తాయి.. రావు.. వాళ్లు ఎవర్నీ గౌరవించరు.. ముస్లిం, మైనార్టీలు, హిందువులను ఎవ్వరినీ పట్టించుకోరు. లంబాడా, గిరిజనులకు ఇవ్వాల్సింది ఇవ్వరు..' నాలుగు నెలల్లో ఇంత రాక్షస పాలన ఈ రాష్ట్రంలో కొనసాగుతుందంటూ ధ్వజమెత్తారు. బంపర్ మెజార్టీతో బాజిరెడ్డి గోవర్ధన్ గెలుస్తున్నారని కేసీఆర్ ధీమా వ్యక్తంచేశారు. స్వల్ప వ్యవధిలోనే ఏ రకంగా చూసినా కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రకాలుగా వైఫల్యం చెందిందని, బీజేపీతో మనకేమీ ఒరగలేదన్నారు. మంచినీళ్లు రాక.. సాగునీళ్లు రాక.. కష్టపడి పండిన పంటను కొనేటోళ్లు లేక రైతు గోసపడుతున్నారని, ఐదు నెలల్లో రాష్ట్రంలో రాక్షస పాలన చూసినమని, ఇవన్నీ మారాలంటే.. పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎంపీలు ఉండాల్సిన అవశ్యకత ఉందంటూ గులాబీ దళపతి కేసీఆర్ అన్నారు.

'**నేను గులాబీ జెండా** ఎత్తిన్నాడు నిజామాబాద్ జిల్లా అండగా నిలబడ్డది. నేను బతికినంత కాలం నిజామాబాద్ నా గుండెల్లో ఉంటది. ఉద్యమాన్ని ఆకాశానికి ఎత్తింది కూడా ఈ గడ్డనే. నేను మీ బిడ్డగా చెప్తున్నా. బీజేపీ ఎంపీలు గెలిస్తే మోదీ దగ్గర చేతులు కట్టుకుంటారు. మన హక్కుల కోసం నోరు మెదపరు'

'**అన్ని విషయాల్లో** మోదీని వ్యతిరేకించిన కాబట్టే, బీజేపీ చెప్పినట్లు నేను వినలేదనే నా బిడ్డ కవితను అరెస్ట్ చేసి జైల్లో వేసింద్రు. అయినా నేను భయపడను. కేసీఆర్ ఏనాడూ లొంగిపోలేదు. లొంగిపోయే వ్యక్తి కాదు. మరింత ఉధృతంగా పోరాటం చేస్తా.'

'**నేను హిందువును..** తెలంగాణ ప్రజలకు ఆత్మ బంధువును. అందరం కలిసి బతకాలి. దాంట్లోనే గొప్పతనం. దాంట్లోనే బలం ఉంటది. కానీ ప్రజలను విడదీసేలా మత విద్వేషాలు రెచ్చగొడితే లాభం ఉండదు. మీ ఎంపీ (అర్వింద్) నోరు తెరిస్తే ఎట్లాంటి మాటలు ఉంటాయో. ఎంత గందరగోళం ఉంటదో తెలుసు'




రోడ్‌షోలో కేసీఆర్ ప్లకార్డుతో ఓ అభిమాని

## కామారెడ్డిలో నేడు కేసీఆర్ రోడ్‌షో

### సభాస్థలిని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్



రోడ్‌షో ఏర్పాట్లను పరిశీలిస్తున్న గంప గోవర్ధన్

కామారెడ్డి, మే 6 : లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నేడు (మంగళవారం) కామారెడ్డి జిల్లా కేంద్రంలో రోడ్‌షో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో జేపీఎన్ రోడ్డు వద్ద రోడ్‌షోకు సంబంధించిన ఏర్పాట్లు, సభాస్థలిని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సోమవారం పరిశీలించారు. రోడ్‌షోకు బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆ సందర్భంగా గంప గోవర్ధన్ కోరారు. మాజీ విప్ వెంట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్ ఉన్నారు.